క్లుప్తంగా

గుంతను పూడ్చండి



మంభోజిపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మంభోజిపల్లి – చిట్యాల వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా గుంతను పూడ్చాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు. మంభోజిపల్లి మార్కెట్ దగ్గర మెయిన్ రోడ్డుపై ఉన్న ఈ గుంత రాత్రి వేళల్లో కనిపించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చివేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి



తూప్రాన్‌లో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని మండల కేంద్రం వెల్దుర్తిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. తెలుగు సాహిత్యంలో ధ్రువతార లాంటి మొల్ల కవితాశక్తి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ముకుందం, నర్సింలు, శ్రీనివాస్, రఘు, పవన్‌కుమార్, రవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, తూప్రాన్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రియాంక, శ్రీశైలం గౌడ్, రవీందర్ రెడ్డి, పల్లెర్ల రవీందర్ గుప్తా, నర్సోజి, మామిండ్ల కృష్ణ, సంఘం నాయకులు రఘుపతి, రాములు, జయరాములు, తూప్రాన్ మండల సంఘం అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, మహేశ్, వెంకట్, కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నీలకంఠం

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఎంఈఓ నీలకంఠం అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఫెయిర్‌వెల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. జీవితమంటే గెలుపోటముల సమ్మేళనం అన్నారు. ప్రతీ పరాజయాన్ని ఒక పాఠంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని చెప్పారు. గ్రేడింగ్‌ల గురించి భయపడాల్సిన పని లేదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రావు, మహేశ్వర్, మేగ్యా, అంజాగౌడ్, టీచర్లు, పోషకులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తుల ఇక్కట్లు



షుగర్ టెస్ట్‌ల కోసం వచ్చిన రోగులు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు విధులకు రావాల్సిన పలువురు సిబ్బంది వచ్చారు. దీంతో ఫాస్టింగ్ షుగర్ టెస్ట్‌ల కోసం వచ్చిన రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయం గురించి వైద్యురాలు సాయిసౌమ్య దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బంది ఉదయం 9 గంటల వరకు విధులకు హాజరుకావాలని, ఫాస్టింగ్ షుగర్ రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బతుకే ఓ సంచారం

పశువులకు మేత ఎక్కడ ఉంటే అక్కడే గుడారాలు



చిలప్‌చెడ్ గంగిరెద్దుల వారి గుడారాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నిరంతరం ప్రయాణించడమే వారి పని. ప్రయాణంలో ఏ గ్రామంలోనైన ఖాళీ స్థలం, పశువులకు మేత దొరుకుతుందని అనిపిస్తే గుడారాలు వేసి అక్కడే ఉంటారు. వారి జీవనోపాధి కోసం పశువులను మేపడం, వాటితో సంచరించడం, వాటిని ఆడించడమే గంగిరెద్దుల వారి వృత్తి. చిలప్‌చెడ్ మండలంలోని సోమక్కపేట్ గ్రామ పంచాయతీకి చెందిన గంగిరెద్దుల గూడెం. ఆ గ్రామంలో గంగిరెద్దుల వారు గతంలో వలసకు వచ్చి అక్కడే స్థిరపడటంతో ఆ గ్రామానికి గంగిరెద్దుల గూడెం పేరు వచ్చింది. గంగిరెద్దుల వారిది సంచార జీవితం. ఈ కుటుంబాలు పశువులను మేపుతూ సంచరిస్తూ జీవిస్తుంటారు. వారు స్థిరపడిన గ్రామంలో వారికి మౌలిక వసతులు ఉన్నప్పటికీ వారిది సంచార జీవితమే. వారితో పాటు వారి పిల్లలు కూడా సంచార జీవితానికి అలవాటు పడ్డారు. గంగిరెద్దుల గూడెంలో పది వరకు చదువుకున్న వారు చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు. యువకులు వ్యవసాయానికి, పశువులతో సంచరించడానికి, ఎద్దులను ఆడించడానికి ఎక్కువ ప్రాధాన్యత చూపిస్తున్నారు.

అవగాహన కల్పించాలి

గంగిరెద్దుల వారు తమ పద్ధతి, వైఖరి మార్చుకునేలా అధికారులు అవగాహన కల్పించాలి. తల్లితండ్రులు చదుకోక, వారికి సరైన నేపథ్యం లేకపోవడంతో వారు సంచార జీవితాలకు అలవాటు పడ్డారు. వారి పిల్లలను చదివించేలా ప్రజాప్రతినిధులు, నాయకులు అవగాహన కల్పించాలి.

చదువుకోలే..



నేను చదువుకోకపోవడంతో పశువులను మేపుతూ గ్రామాలు తిరుగుతున్నాం. అప్పుడు మా తల్లిదండ్రులు వారితో తిప్పడం వల్లే సంచార జీవితానికి అలవాటు పడ్డా. నా పిల్లలను అలా కాకుండా చదివిస్తా.

– బత్తుల రాజు, గంగిరెద్దుల గూడెం

పశువులకు నా జీవితం అంకితం



చిన్నప్పటి నుంచి పశువులను తిప్పుతూ తిరగడంతో అదే జీవితం అలవాటుగా మారింది. అప్పట్లో నాకు చెప్పే వారు లేరు. ప్రస్తుతం నా జీవితం పశువులకే అంకితం. అధికారులు మాకు సహకారం అందిస్తే మా పిల్లలను చదివిస్తా.

– జనపాటి మల్లయ్య, గంగిరెద్దులగూడెం

మున్సిపల్ భవన నిర్మాణ పనుల పరిశీలన



కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుల పిల్లలు పాఠశాలకు వెళ్లడం లేదని బుధవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. ఆయన భవన నిర్మాణ పనులు పరిశీలించేందుకు వెళ్లినప్పుడు చిన్నారులు భవనం వద్ద ఉండడాన్ని గమనించి వారి తల్లిదండ్రులతో మాట్లాడగా, పిల్లలు పాఠశాలకు వెళ్లడం లేదని తెలిపారు. ఆయన స్పందిస్తూ.. పిల్లలను వెంట తీసుకెళ్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించి పిల్లలను పాఠశాలలో చేర్పించారు. కాగా పాఠశాలలో తాగు నీటి సమస్య తలెత్తిందని, నీటి సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరగా అశోక్‌గౌడ్ స్పందిస్తూ.. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించాలని సూచించారు. కాగా మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ రాంచందర్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి



మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలీస్ శాఖ ఎస్‌ఐలు, సీఐలు, మండల తహసీల్దార్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికల కోడ్ వస్తుందని చెప్పారు. అంతకు ముందు మీ పరిధిలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి కనీస సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రాజకీయ పార్టీల నాయకులతో..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆయా రాజకీయ పార్టీల మండల శాఖల అధ్యక్షులతో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు అందరూ పాటించాలని, సజావుగా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమతో సహకరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా.. కమిషన్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీపీఈ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి పిల్లలకు పాఠాలు బోధించారు. ఈడీఓగా శ్రీవత్సవ్, హెచ్‌ఎంగా మహేందర్, పీఈటీగా ప్రణీత, ఉపాధ్యాయులుగా శ్రీకృతి, వేదప్రియ, శాలిని, మన్విష, నికిత, నిశాంత్, అటెండర్‌గా మనోజ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, శేరిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు మధురవాణి, రోహిణి, జయంతి, రాజు పాల్గొన్నారు.

చందాయిపేట ప్రాథమిక పాఠశాలలో ..



చేగుంట(తూప్రాన్): చందాయిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఐదోతరగతి విద్యార్థులు స్వయం పాలన కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. హెచ్‌ఎంగా అరవింద్, ఎంఈఓగా నగేశ్, డీఈఓగా నిహారిక, కలెక్టర్‌గా సోఫియా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు పెద్దమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 14న గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారి అభిషేకం, ప్రత్యేక పూజలు, శివపార్వతుల కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, 15న పెద్దమ్మ బోనాల ఊరేగింపు, 16న ఎడ్లబండ్ల ఊరేగింపు ఉంటాయని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు.

ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

నర్సాపూర్: మాల మాదిగలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయకపోవడం సరికాదని ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాల, మాదిగలతో పాటు 57 ఉపకులాలకు మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రస్తుతం విస్మరించడం సరికాదని అన్నారు. ఉపకులాలను మాల మాదిగల కింద తోసి వేయడాన్ని ఖండించారు. ఉప కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండు చేశారు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ల ద్వారా ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ధర్మకర్తల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం చైర్మన్, ధర్మకర్తల మండలి ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఆలయ కమిటీ పదవీకాలం ఇటీవల ముగిసిందన్నారు. ప్రభుత్వం కొత్తగా ఆలయ చైర్మన్, ధర్మకర్తల ఎంపికకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు చెప్పారు. ఉత్సాహం ఉన్న వారు పదిరోజులలోపు పూర్తి ధ్రువపత్రాలతో సంగారెడ్డిలోని దేవాదయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు.

వైభవంగా శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠ



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి హనుమాన్ దేవాలయంలో శివపంచాయతన నూతన విగ్రహ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి హాజరై హోమం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టడం శుభపరిణామమని అన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు సహకరించిన ఎమ్మెల్సీని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొంపల్లి సుభాశ్‌రెడ్డి, చీనూరి నారాయణరెడ్డి, కరణం రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ బయ్యన్న, వెంకటేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రామాయంపేట(మెదక్): కాట్రియాల తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల పెద్దతండాలో బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో రూ. 20 లక్షలు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. నాణ్యతగా, త్వరగా పనులు పూర్తిచేయాలని నాయకులకు తండావాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఉపాధ్యక్షుడు సిద్ధరాంలు, ఇతర నాయకులు నగేశ్, కంలియా నాయక్, సర్దార్ నాయర్ పాల్గొన్నారు.

దనూర గ్రామంలో ..



దనూరలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మండలంలోని దనూర గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్, మండల సీనియర్, యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ గౌతమ్, మండల సీనియర్ నాయకులు బాగారెడ్డిగారి నర్సింహరెడ్డి, ఎల్లంపల్లి సత్యనారాయణ, మల్లారెడ్డి, రామగళ్ల, అంజయ్య, నారాయణ గౌడ్, రాంరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిద్ధు, గ్రామ అధ్యక్షుడు లాడే కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే



ఆస్పత్రి బయట ల్యాబ్‌టెక్నీషియన్స్

మెదక్: జిల్లా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు బుధవారం ఆస్పత్రుల సమన్వయ కర్త సాత్విక్, చారిటీ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైద్యం అందించడంలో రోగ నిర్ధారణ ఎంతో ముఖ్యం కాబట్టి ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని అన్నారు. రోగులకు సేవ చేయడం ద్వారా సంతృప్తి లభిస్తుందన్నారు. అనంతరం సాత్విక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు, శివదయాళ్, కిరణ్ కుమార్‌రెడ్డి, షర్మిల, పాథోలోజిస్ట్ ప్రియదర్శిని, టీహబ్ మేనేజర్ ప్రజ్ఞ, ప్రభుత్వ ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

సైడ్ మిర్రర్‌కు ఫ్లెక్సీ

- ప్రచారం కోసం సూచిక బోర్డులు



అల్లాదుర్గం బ్రిడ్జి వద్ద సైడ్ మిర్రర్‌కు ఎంపీ ఫ్లెక్సీ



ఫ్లెక్సీతో కనిపించకుండా పోయిన సైడ్ మిర్రర్

అల్లాదుర్గం(మెదక్): నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు బలవుతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం హైవే బ్రిడ్జిల వద్ద సైడ్ మిర్రర్లు ఏర్పాటు చేశారు. ఇవే ఇప్పుడు పార్టీ నేతల ప్రచారానికి ఫ్లెక్సీలుగా మారుతున్నాయి. ఈ సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. బీజేపీ జహీరాబాద్ అభ్యర్థిగా ఆయన పోటీ చేస్తున్నారు. ఎంపీ తన ప్రచారం కోసం ప్రతీ గ్రామానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న హైవే బ్రిడ్జి కింద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన సైడ్ మిర్రర్‌కే ఎంపీ ప్రచారణ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రజల రక్షణకు కృషి చేయాల్సిన ఎంపీ, ప్రమాదాలకు ఫ్లెక్సీ కారణం అవుతున్నారు. సైడ్ మిర్రర్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని, హైవే సిబ్బంది, పోలీసులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని కంచన్‌పల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో గ్రూపులో పదిహేను మంది కూలీలు ఉండగా ఏడు, ఎనిమిది మంది మాత్రమే పనులకు వస్తున్నట్లు చెప్పారు. మండలంలో 1600 కూలీలు పనులు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రూ. 272 గిట్టుబాటు కూలీ కల్పిస్తుందనారు. కూలీలకు రోజువారి కూలీ గిట్టుబాటు అయ్యేందుకు కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పని అడిగిన ప్రతీ కూలీకి పనులు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మార్పీస్ జిల్లా సభకు తరలిరండి

చేగుంట(తూప్రాన్): ఎమ్మార్పీస్ జిల్లా సభకు అందరూ రావాలని ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు రామస్వామి అన్నారు. చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సదస్సులో భాగంగా గురువారం జిల్లా సభను మెదక్ ద్వారకా గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు భారీ సంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్నం భూమయ్య, శ్రీను, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

◆ సభకు రావాలి

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ద్వారక గార్డెన్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశం జయప్రథం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు స్వామి కోరారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

◆ అన్నదానం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి వేంకటేశ్వర ఆలయం వద్ద బుధవారం ధర్మకర్త కిషన్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించి, భక్తుల సౌకర్యం కోసం అన్నదానం చేసినట్లు కిషన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్, చిట్టోజిపల్లి గ్రామాల భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

◆ అక్రమ ఇసుక రవాణాను ఆపండి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్ గ్రామ శివారులోని మంజీరా నగర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను ఆపాలని ఆ గ్రామానికి చెందిన యువకులు బుధవారం తహసీల్దార్ గఫూర్ మియాకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పగలు, రాత్రి అని తేడా లేకుండా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించడంతో బోర్లల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆరోపించారు. దీంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని వారు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ ఇసుక రవాణాను ఆపాలని డిమాండ్ చేశారు.

◆ ఎల్‌ఓసీ పంపిణీ



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వరాల వెంకటలక్ష్మి అనారోగ్యానికి గురైంది. దీంతో ఆస్పత్రిలో చికిత్స కోసం బాధితుడికి రూ1.50లక్షలు ఎల్‌ఓసీ అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ట్రాక్టర్ పట్టివేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అక్కడి గ్రామస్తులు బుధవారం పట్టుకున్నారు. దీంతో ఈ విషయాన్ని కొల్చారం పోలీసులకు తెలియజేశారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ గౌస్ తెలిపారు.

◆ విద్యార్థులు బాగా చదవాలి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, బహుమతులు అందించారు. మోడల్ పాఠశాలలో జీఎంఆర్ ప్రతినిధులు పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందించారు. హెచ్‌ఎం నీరజ , ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ నేడు మండల సర్వసభ్య సమావేశం

కొల్చారం(నర్సాపూర్): మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.